ప్రజాశక్తి

గురువారం 19 అక్టోబర్ 2023

మూడు కేసుల్లో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం

నగర పరిధిలో జరిగిన 3 దొంగతనం కేసుల్లో నిందితులను అరెస్టుచేసి వారి నుంచి సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు 1వ పట్టణ సిఐ బి.వెంకటరావు తెలిపారు.బుధవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ చోరీలకు సంబంధించిన విషయాలను వెల్లడించారు. నగరానికి చెందిన శ్రీనివాసరావు తన బైక్ సీటుకవర్‌లో రూ.2,50,000 ఉంచి బైక్‌ను కర్రల మార్కెట్ వద్ద ఆపి లోపలికి వెళ్లి తిరిగి వచ్చే సరికి సొమ్మును ఎవరో గుర్తితెలియని వ్యక్తి దొంగిలించుకొని పోయారు. ఆయన ఫిర్యాదు మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. కె.ఎల్.పురం జంక్షన్‌లో నిందితుడు కె.వెంకటరమణ అరెస్టు చేసిన అతడినుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే పోలయ్యపేట వద్ద ఎటిఎంలో నగదు దొంగిలించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని, కొత్త అగ్రహారంలో ఓ మహిళ మెడలో గొలుసు తెంపుకొని పారిపోయిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు.



6 యూనిట్లకు రూ.196 బిల్లు వచ్చింది

నేను అద్దెకు తీసుకున్న ఇల్లు మూడు నెలలుగా మూతపడి ఉంది. కరెంటు పూర్తిగా వాడలేదు. కానీ, 6యూనిట్లు వినియోగించినట్టుగా బిల్లలు వచ్చింది. బిల్లు మాత్రం రూ.196 వచ్చింది. ఇది చాలా దారుణం. ఆరు నెలల క్రితం కనీస ఛార్జీ రూ.60 మాత్రమే వచ్చేది. ఎందుకింతలా భారం పడుతోందంటే విద్యుత్ శాఖ సిబ్బంది ఎవరూ స్పష్టంగా చెప్పడం లేదు. ఎప్పుడో వినియోగించిన విద్యుత్‌పై ఇప్పుడు ఛార్జీలు విధిస్తున్నట్టు సిపిఎం నాయకుల ప్రచారం ద్వారా అర్థమౌతోంది. ప్రభుత్వానికి డబ్బులు గుంజుకోవడం తప్ప, ప్రజలపై పడుతున్న భారాలు గుర్తుకు రావడం లేదు.

- గవర వెంకటరమణ, కర్రోతు వీధి, సీతానగరం

సర్దుబాటు పేరిట బాదుడు

- ఏడాదికి రూ.24 కోట్ల భారం
- విద్యుత్తు భారాలకు వ్యతిరేకంగా నేడు సిపిఎం ఆధ్వర్యాన సదస్సు
- హాజరు కానున్న రాష్ట్ర నాయకులు తులసీదాస్, నర్సింగరావు

విద్యుత్ ఛార్జీల పెంపుతో సగటు వినియోగదారులు విలవిల లాడుతున్నారు. గృహ వినియోగదారులు, చిన్నవ్యాపారులు, రైతులు, ఫెర్రో పరిశ్రమల యాజమాన్యాలు ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నాయి. సర్దుబాటు. ట్రూ అప్ ఛార్జీల పేరిట మోపిన భారం వల్ల జిల్లాపై ఏడాదికి సుమారు రూ.24కోట్ల మేర భారం పడుతోంది. బిజెపి ఆధ్వర్యాన వైసిపి ప్రభుత్వం మోపుతున్న విద్యుత్ భారాలపై ప్రజల్లో తీవ్ర అసహనం వ్యక్తమౌతోంది. ఈనేపథ్యంలో విజయనగరం ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన చేపడుతున్న ఆందోళనా కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో భాగస్వామ్యమౌతున్నారు. సిపిఎం పోరాటంలో భాగంగా విజయనగరంలోని ఎన్‌పిఆర్ (సిపిఎం) కార్యాలయంలో ఈనెల 19న రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నారు. జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ సదస్సుకు ముఖ్య వక్తలుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, రాష్ట్ర నాయకులు సిహెచ్ నర్సింగరావు హాజరు కానున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఉమ్మడి జిల్లాలో 8,11,017 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహాలకు 6,71,921, వాణిజ్యం 68,939, ప్రభుత్వ కార్యాలయాలకు 15,321, వ్యవసాయ పంపుసెట్‌లకు, 52,082 ఉన్నాయి. వీటన్నింటికీ ఎపిఇపిడిసిఎల్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది. వినియోగదారులంతా ఎప్పటికప్పుడే బిల్లులు చెల్లిస్తున్నారు. ఒక వేళ గడువు తేదీలోపు చెల్లించకపోతే ఫీజులు పీకేసి మరీ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. అయినప్పటికీ వినియోగదారులు చెల్లించిన డబ్బులు విద్యుత్తు ఉత్పత్తికి, పంపిణీ తదితర ఖర్చులకు సరిపోలేదంటూ వసూలు చేస్తున్నారు. సర్దుబాటు ఛార్జీ అంటే ఇదే. మరే సంస్థలోనూ లేని విధంగా విద్యుత్ పంపిణీ సంస్థల్లోనే ఇటువంటి విధానం ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే 2014 నుంచి 19 వరకు వినియోగించుకున్న విద్యుత్‌కు చెల్లించిన బిల్లులు సరిపోలేదంటూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,900 కోట్లమేర సర్దుబాటు భారం మోపింది. జనం నుంచి మూడేళ్లపాటు వసూలు చేయడానికి విద్యుత్ ఛార్జీల నియంత్రణ మండలి ద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలు ఆమోదం పొందాయి. ఇప్పటికే యూనిట్‌కు 20పైసలు చొప్పున 11నెలల పాటు వినియోగదారులు అదనంగా చెల్లించారు. మరో 25 నెలలపాటు చెల్లించాల్సి వుంది. ఇది చాలదన్నట్టుగా 2021 -22 ఆర్థిక సంవత్సరంలో వినియోగించిన విద్యుత్ బిల్లులకు చెల్లించిన మొత్తం సరిపోలేదంటూ మరోసారి 20పైసలు చొప్పున సర్దుబాటు ఛార్జీలు మోపుతున్నారు. పాత, కొత్త సర్దుబాటు ఛార్జీలు 40పైసలు మోయడమే వినియోగదారులకు అత్యంత కష్టతరంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో విద్యుత్ భారాన్ని తగ్గించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు పడుతున్న భారాలకు ఎప్పటి వరకో ఎందుకు ఆగాలి అంటూ మరుచటి నెలలోనే సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయాలని ఆదేశించింది. మోడీ ఆదేశాలే తడువుగా జగన్ సర్కారు ఏప్రిల్ నెలలో చెల్లించిన డబ్బులు సరిపోలేదని మరో 40పైసలు వసూళ్లకు సిద్ధపడింది. ఈ లెక్కన కేవలం సర్దుబాటు ఛార్జీ రూపంలోనే 80పైసలు భారం పడుతోంది. జిల్లాలో రోజుకు సుమారు కోటి యూనిట్ల వినియోగం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వాసులపై నెలకు రూ.80లక్షల వరకు భారం పడుతోంది. ఏడాదికి రూ.24కోట్ల భారం పైమాటే. దీనికితోడు నెలవారీ వినియోగపు బిల్లు, ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ట్రూ అప్ ఛార్జీ తదితరాల రూపంలో అధిక మొత్తంలో బిల్లులు విధించారు. 20 నుంచి 30 యూనిట్లు వినియోగించిన సామాన్య కుటుంబాలకు వేల రూపాయల బిల్లులు వస్తున్నాయి. దీంతో, గత నెలతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో బిల్లులు వచ్చాయంటూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ఛార్జీకన్నా ఇలా కొసరుగా విధిస్తున్న ఛార్జీలే అధికంగా ఉన్నాయి. వాస్తవానికి సర్దుబాటు ఛార్జీలకు పాలకుల విధానాలే కారణం. బొగ్గు, ఇంధన రేట్లు కార్పొరేట్ సంస్థలు తమ ఇష్టానుసారంగా పెంచుకునేందుకు సహకరిస్తున్నాయి. ఫలితంగా విద్యుత్ తయారీ, పంపిణీ సంస్థలపై పెరిగిన భారాన్ని ప్రజలపై మోపేందుకు సిద్ధమవుతున్నాయి.

ఛార్జీల పెంపుతో భారంగా మారింది

విద్యుత్‌ఛార్జీల యూనిట్ ధర డబుల్ రావడంతో భారంగా మారింది. మెకానిక్ రంగంలో బతకడం కష్టంగా ఉంది. ప్రతినెలా ఛార్జీలు పెరిగిపోతే కుటుంబాన్ని ఎలా పోషించుకోగలుగుతాం. అప్పుడెప్పుడో వాడిన విద్యుత్తుకు ఇప్పుడు ఛార్జీలు అధికంగా వసూలు చేస్తున్నారు. యూనిట్లలో తేడా లేకపోయినప్పటికీ అదనపు ఛార్జీలు వసూలు చేయడం అన్యాయం.

- జె.మహేష్, మెకానిక్, విటి అగ్రహారం, విజయనగరం

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఇంటింటికీ తాగునీరు

జగనన్నకు చెబుదాంలో కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-దత్తిరాజేరు

జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కృషి చేస్తామనిజిల్లా కలెక్టర్ నాగలక్ష్మి హామీ ఇచ్చారు. దీనికి సంబంధించి ఇప్పటికే టెండర్లను పిలవడం జరిగిందని, ఖరారు కాగానే పనులు ప్రారంభిస్తామని అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన జెకెసి కార్యక్రమానిక కలెక్టర్ నాగలక్ష్మి హాజరై, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 69 అర్జీలు వచ్చాయి.ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయాలని, రోడ్లు, కాలువలు మంజూరు చేయాలని, శ్మశాన వాటికలకు రోడ్లు వేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని తదితర సమస్యలపై వినతులు ఎక్కువగా వచ్చాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ తోపాటు, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, బొబ్బిలి ఆర్‌డిఒ శేషశైలజ, తాహశీల్దార్ రమేష్, ఎంపిడిఒ సుబ్రమణ్యం, ఇతర జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్‌కు డివైఎఫ్ఐ ఆధ్వర్యాన పలువురు వినతులు అందజేశారు. గడసాం, చినకాద మార్గమధ్యలో ఉన్న కొండ అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని, గతంలో స్పందనలో అందజేసిన దానిపై సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. గజపతినగరం-పోరలి గ్రామాల మధ్య బైపాస్ రోడ్డు మంజూరై నాలుగేళ్లయినా ఇప్పటివరకు 50 శాతం కూడా రోడ్డు పనులు జరగలేదని తెలిపారు. రోడ్డు పనులు మార్గాలలో ఎటువంటి హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడంతో ప్రమాదాలు జరగుతున్నాయని తెలిపారు.

విద్యుత్తు సదస్సును జయప్రదంచేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న విద్యుత్తు ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన గురువారం నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు కోరారు. ఈమేరకు 29వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తూ విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.8వేల కోట్లు సర్‌ఛార్జీలు వసూలు చేస్తోందని అన్నారు. గత ఏడాది కరెంటు ఛార్జీలు పెంచి రూ.1400 కోట్లు భారం మోపిందని తెలిపారు. ఈనేపథ్యంలో కెఎల్‌పురం ప్రజాసంఘాల కార్యాలయంలో విద్యుత్ సంస్కరణలపై రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

వైద్య సేవలు మరింత చేరువ : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత చేరువ చేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని కమ్మ వీధి ప్రాంతంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత సరళతరమైన ఆరోగ్య సేవలు అందుతున్నాయన్నారు. డిఎంహెచ్ఒ భాస్కరరావు, స్థానిక కార్పొరేటర్ గుజ్జల నారాయణరావు, సహాయ కమిషనర్ ప్రసాద్ రావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూలబాగ్‌లో గడప గడపకూ..

నగరంలోని 3వ డివిజన్ పూల్‌బాగ్ వాడవీధి పార్క్ నుండి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలోకోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్లెట్లను స్థానికులకు అందజేస్తూ అర్హత ఉండి పథకాలు పొందలేని వారి వివరాలను తెలియజేయాలని కోరారు. చిన్నచిన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అక్కడున్న అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, సహాయ కమిషనర్ ప్రసాదరావు, 2వ డివిజన్ కార్పొరేటర్ బండారు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగరంలోని 39, 42 డివిజన్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బొబ్బాదిపేట, గౌతమి నగర్లలో 9 లక్షల రూపాయలతో అభివద్ధి పనులకు శంకుస్థాపన చేయగా, 42వ డివిజన్ దండుమారమ్మ ఆలయం ప్రాంతంలో రూ.23 లక్షలతో నాలుగు చోట్ల నిర్మించిన రహదారులను ప్రారంభించారు. జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ వి ఎస్ ప్రసాద్, మేయర్ విజయలక్ష్మి, వైసిపి నాయకులు పిన్నింటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎండిన వరి పంట పరిశీలన

ప్రజాశక్తి- గజపతినగరం

మండలంలోని జిన్నాం గ్రామంలో వర్షాభావం వల్ల ఎండిపోయిన వరి పంటను జిల్లా వ్యవసాయాధికారి బిటి రామారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో సుమారు 150 ఎకరాల్లో పంట ఎండిపోయిందన్నారు. మరో వారం రోజుల్లో వర్షాలు పడకపోతే మరో 415 ఎకరాల వరకూ ఎండిపోయే ప్రమాదం ఉందని అంచనా వేశారు. నేలలో పదును లేకపోయినప్పటికీ వరి పంట పచ్చగా ఉన్నట్లయితే మల్టీకెను ఎకరాకు 100 నుంచి 150 గ్రాములు పిచికారి చేసుకుంటే కనీసం పది రోజులు వరి పంట ఎండిపోకుండా కాపాడుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎఒ, రైతులు పాల్గొన్నారు.

జిన్నాంలో ఎండిపోతున్న వరిని పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ రామారావు

సచివాలయ ఉద్యోగిపై దాడి

- వికలాంగుడని చూడకుండా పిడిగుద్దులు
- పోలీసుస్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్, టౌన్

జిల్లా కేంద్రంలోని కొత్త బెలగాం 16వ వార్డు 8వ సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శి జి. శంకర్రావుపై అదేవార్డుకు చెందిన కొందరు బుధవారం దాడి చేశారు. పిడిగుద్దులు గుద్దుతూ భౌతికదాడికి పాల్పడినట్లు బాధితుడు తెలిపారు. 8వ సచివాలయానికి 16వ వార్డుకు చెందిన తొండ్రంగి సంతోష్‌కుమార్, జంపా జగన్నాథం, పాలకొల్లు రాముతో పాటు మరికొందరు వ్యక్తులు మధ్యాహ్న భోజన సమయంలో వెళ్లారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గొండేల వెంకటరమణ (వికలాంగుడు)తో జగనన్న చేదోడు పథకంలో తాము అర్హులమైనప్పటికీ ఎందుకు ఎందుకు పరిగణలోకి తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా అతనిపై చేయి చేసుకుంటూ కులంపేరుతో దూషించారని బాధితుడు చెప్పాడు. భయంతో కేకలు వేయడంతో తన సహోద్యోగి రావడంతో బతికానని తెలిపాడు. ఈ సంఘటన మధ్యాహ్నం 2గంటలకు జరిగినప్పటికీ

వివరాలు వెల్లడిస్తున్న బాధిత ఉద్యోగి శంకరావు

పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు రాత్రి 7గంటల వరకు తీసుకోలేదు. దీంతో మిగతా సచివాలయ ఉద్యోగులంతా తమ విధులు ముగించుకుని పోలీసు స్టేషన్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేసారు. ఇంతలో ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర కార్యదర్శి జివికిషోర్ కల్పించుకుని పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసి, బాధితుడు, ఉద్యోగులు కలసి డిఎస్‌పి కార్యాలానికి వెళ్లారు. వెంటనే కేసు నమోదు చేసి బాధితునకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఒపిఎస్‌కు అమలుకు 29న ఎపిటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ ఈనెల 29న విజయవాడలో ధర్నా చేయనున్నట్లు ఎపిటిఎఫ్ (1938) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎ.సదాశివరావు తెలిపారు. బుధవారం జిల్లా శాఖ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు డి.ఈశ్వరరావు అధ్యక్షత ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశం లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ,ఉపాధ్యాయులకు సిపి ఎస్ ను రద్దు చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కొత్తగా జిపి ఎస్ తీసుకొచ్చి ఉద్యోగులను మరో మోసం చేస్తోందన్నారు. తక్షణమే జిపి ఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్ అమలు చేయాలని, ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, 2003 డిఎస్సీ వారికి పాత పెన్షన్ అమలు చేయాలని, బకాయి పడ్డ డిఎ, పిఎఫ్, ఎపి జిఎల్ఐ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటి సాధనకు చేపడుతున్న ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రాష్ట్రంలో రాజ్యాంగం అమల్లో ఉందా?

'బాబుతో నేను'లో అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి -విజయనగరం కోట

రాష్ట్రంలో రాజ్యాంగం అమలులో ఉందా అని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం కోట జంక్షన్ వద్ద వాజీ ఛానల్ ఎమ్‌డి గణపతినీడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'నీ కోసం దీక్షబూని సాగుతాం చంద్రన్నా' పేరిట జరిగిన కార్యక్రమంలో అశోక్ గజపతిరాజు పాల్గొని గాంధీ బొమ్మకు, ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ప్రశ్నిస్తే ఎవరినైనా జైల్లో పెడుతున్నారని, విచారణ మాత్రం వారికి నచ్చినప్పుడు చేస్తున్నారని అన్నారు. గణపతినీడి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని సుదీర్ఘకాలంపాటు అభివద్ధి పథంలో నడిపించిన చంద్రబాబును 40 రోజులుగా జైలులో పెట్టడం అమానుషమని అన్నారు. టిడిపి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కిమిడి నాగార్జున, ఐవిపి రాజులు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పరిపాలన జరగడం లేదని, రాష్ట్రం అధోగతి పాలైందని అన్నారు. అంతకుముందు నగరంలోని పిడబ్ల్యు మార్కెట్‌లో 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా వర్తకులకు, కొనుగోలుదారులకు కరపత్రాలను అశోక్‌గజపతిరాజు పంచిపెట్టారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా, ఆయనకు మద్దతుగా ఒక మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. ప్రజల ప్రాథమిక హక్కులను రాష్ట్ర ప్రభుత్వం హరిస్తుందన్నారు. టిడిపి ప్రజల పక్షాన నిలబడిన పార్టీ అని, అందుకే ప్రజలంతా మద్దతు తెలపాలని అన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకులు కలిశెట్టి అప్పల నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి కె.పోలినాయుడు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, కార్యదర్శి బంగారుబాబు, జిల్లా కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, కనకల మురళీమోహన్, వి. శ్రీనివాసరావు, విజ్జపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మద్దతు తెలపాలని పిడబ్ల్యుమార్కెట్‌లో కరప్రతాలు పంచుతున్న అశోక్‌గజపతిరాజు

మీడియా అకాడమీ చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర అభివృద్ధికి విశాఖపట్నం గ్రోత్ ఇంజిన్‌లాంటిదని సి.రాఘవాచారి రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. విజయనగరం జిల్లాలో బుధవారం ఆయన పర్యటించారు. రామనారాయణం, పైడితల్లి అమ్మవారి ఆలయం, రామతీర్థం శ్రీసీతారామస్వామి ఆలయాలను సందర్శించారు. పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద మీడియాతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా, పోర్టులు, వివిధ రకాల ప్రాజెక్టుల రూపంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని చైర్మన్ అన్నారు. విజయనగరంలో ప్రభుత్వ వైద్య కళాశాల, శ్రీకాకుళం జిల్లాలో మూలపేట పోర్టు, విశాఖలో ఇన్‌ఫోసిస్ కేంద్రం లాంటివాటిని ఉదహరించారు. అభివృద్ధికి విశాఖ కేంద్రంగా ఉత్తరాంధ్ర ముఖచిత్రం మారుతోందని అన్నారు. గతంలో ఉత్తరాంధ్ర నుంచి వలసలు ఎక్కువగా ఉండేవని, ఉపాధి అవకాశాలు పెరగడంతో ప్రస్తుతం బాగా తగ్గాయని తెలిపారు. విశాఖపట్నం ఇప్పటికే ఎంతో అందమైన నగరమని, దానిని మరింత అందంగా, అభివద్ధికి కేంద్రంగా మార్చేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష మరో అద్భుత కార్యక్రమమని ప్రశంసించారు. మీడియా అకాడమీ పరంగా జర్నలిస్టుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని, దీనిలో భాగంగా ప్రతీ శనివారం ఆన్‌లైన్‌లో క్లాసులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ రకాల పుస్తకాలను ప్రచురిస్తున్నామని వివరించారు. పర్యటనలో ఓఎస్‌డి శ్రీనివాస్ జీవన్ పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న శ్రీనివాసరావు తదితరులు

ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన విద్యార్థులతో ప్రతినిధులు

'సీతం'లో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజనీరింగ్ కళాశాలలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీ ఆధ్వర్యాన బుధవారం ప్రాంగణ నియామకాలు చేపట్టారు. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో బిఎస్‌సి, డిప్లొమా చదివిన విద్యార్థులు హాజరయ్యారు . వీరికి స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణులైన వారికి ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేసుకున్నారు. ఇందులో సుమారు 800 మంది హాజరుకాగా, 220 మంది ని తీసుకున్నట్టు తెలియజేసారు. ఈ ఎంపిక ప్రక్రియను లీడ్ ఎంప్లాయ్ రిలేషన్స్ అధిపతి డి.లక్ష్మి దీపక్, మేనేజర్ ఎల్అండ్‌టి లక్ష్మి దుర్గ ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ ఈ ఏడాది మూడోసారి ప్రాంగణ నియామకాల ద్వారా ఎంపికచేసుకున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీతంలో భవిష్య 2.0 ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

సీతం ఇంజనీరింగ్ కళాశాలలో బిబిఎ, ఎం.కామ్, ఎంబిఎ చదివే విద్యార్థులకు రిలయన్స్ రిటైల్స్ స్టోర్స్ ప్రాజెక్టు లీడ్ ముబీనా షేక్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం భవిష్య 2.0 గురించి వివరించారు. విద్యార్థులు నూతన వ్యాపారాలు ప్రారంభించేందుకు, రిటైల్ రంగంలో పనిచేసేందుకు కావలసిన నైపుణ్యం పెంపొందించుకోవటానికి శిక్షణ అందిస్తామని తెలిపారు.

భూ రికార్డుల తయారీలో జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్

భూ రికార్డుల తయారీలో రెవెన్యూ సిబ్బంది జాగ్రత్తలు వహించాలని తహశీల్దార్ డి.రాజేశ్వం రావు సూచించారు. బుధవారం వైఎస్ఆర్ జగన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం' లో భాగంగ గోపాల్ రాయుడు పేట రెవెన్యూ గ్రామ పరిధిలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూతింగ్ పనుల ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే టీములు ప్రభుత్వ భూములను రికార్డుల ప్రాప్తికై స్పష్టంగా కచ్చితంగా కొలతలు తీసుకొని భూ రికార్డులను తయారు చేయాలని, సర్వే టీమ్‌లు తప్పకుండా రైతుల సమక్షంలోనే వారి వారి పొలాలను కొలతలు తీసుకోవాలని, అప్పగించిన పనిని ప్రభుత్వ నిబంధన మేరకు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతీ రైతుకూ తమ పొలాలు దగ్గరకు సర్వే టీమ్ వచ్చినప్పుడు వారి ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్ తీసుకువచ్చి సర్వే టీమ్‌కు అందచేసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

మౌనికకు నగదు బహుమతి అందిస్తున్న సిరిసహస్ర, ప్రదీప్

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం చిన్న శ్రీను సోల్జర్స్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాస్ రావు కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర, బడ్డుకొండ ప్రదీప్ సైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం సౌత్ ఆఫ్రికాలో జరిగిన ప్రపంచ టెన్నికాయిట్ చాంపియన్ షిప్‌లో బంగారు పతాకం సాధించిన రెడ్డి మౌనికను సత్కరించి రూ. 10వేలు బహుమతిగా అందజేశారు. అనంతరం మౌనిక మాట్లాడుతూ తనకు సౌత్ ఆఫ్రికా వెళ్లేందుకు లక్ష రూపాయలు తక్కువగా ఉన్నాయని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావును కోరగా వెంటనే స్పందించి రూ. లక్ష ఇచ్చి కావలసిన కిట్లు, తదితర సదుపాయాలు కూడా కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

ప్రజాశక్తి-బొబ్బిలి

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే పోరాటం చేసి అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మణికుమార్, శివ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి 25 వరకు ప్రభుత్వం కళాశాలలకు సెలవులు ప్రకటించిందని, ఆయా రోజుల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు.

ప్రతిభ కనబర్చిన పోలీసు డాగ్

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర పోలీసుశాఖ ఇంటిలిజెన్సు సెక్యూరిటీ విభాగం ఆధర్యంలో మంగళగిరి సిటిసి శిక్షణ కేంద్రంలో తొమ్మిది నెలల శిక్షణలో విజయనగరం జిల్లాకు కేటాయించిన ట్రాకింగ్ డాగ్ 'లవ్ లీ' స్పేర్ హ్యాండ్లర్ బి. జగదీష్ ఉత్తమ ప్రతిభ కనబర్చింది. రాష్ట్ర హోంశాఖ మంత్రి చేతుల మీదుగా బహుమతిని పొందినట్లుగా ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన పోలీసు డాగ్స్, వాటి హ్యాండ్లర్లు మంగళగిరిలో ఇటీవల శిక్షణ ఇటీవల పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలవగా ఆమె అభినందించారు.

రికార్డులను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ తరహా వైద్యం

రామభద్రపురం: ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ తరహా వైద్య సేవలే లక్ష్యంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని కేంద్ర ఎన్క్వాస్ బృందం సిఎంఒ నాగరాజు, మెటర్నల్ చైల్డ్ హెల్త్ ఆఫీసర్ ఈశ్వరి ఆదేశించారు. బుధవారం ఆరికతోట పిహెచ్‌సిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణ, పలు రికార్డులు పరిశీలించారు. రోగులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, సేవల వివరాలు ఆసుపత్రి వైద్యులు దీపక్ కుమార్, అపర్ణలను అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ సేవలకు ప్రోత్సాహకంగా ఆర్థిక సాయం అందిస్తామని ఇలా వచ్చిన మొత్తాన్ని ఆసుపత్రి అభివృద్ధికి ఖర్చు చేయాలని కోరారు. గ్రామాల్లో అత్యుత్తమ వైద్య సేవలు, ఉచిత మందులు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని, పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

వైసిపి పాలనకు చరమగీతం

ప్రజాశక్తి- గజపతినగరం


అరుణను సత్కరిస్తున్న గురాన అయ్యలు

జన సేన, టిడిపి కలయికతో జిల్లాలోను, రాష్ట్రంలోను వైసిపి పాలనకు ప్రజలు చరమగీతం పాడుతారని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. జనసేన పిఎసి సభ్యురాలుగా నియమితులైన పడాల అరుణను బుధవారం గురాన అయ్యలు ఆధ్వర్యంలో గజపతినగరంలో కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మీడియాతో మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా పని చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేన-టిడిపి కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రభుత్వం కొనసాగిస్తున్న ధమనకాండ నుంచి ప్రజలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఆదాడ మోహన్ రావు, డి.రామచంద్రరాజు, మాతా గాయిత్రి, పితాల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం వ్యాఖ్యలు అభ్యంతరకరం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిపై డిప్యూటీ సిఎం నారాయణ స్వామి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని టిడిపి జిల్లా పార్లమెంట్ మహిళా అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. భువనేశ్వరి తన భర్త అక్రమ కేసులను ధైర్యంగా ఎదుర్కొంటున్నారే తప్ప దొంగ ఏడుపులు ఏడ్చుకుంటూ మాయ మాటలు చెప్పుకుంటూ రాష్ట్ర వ్యాప్తంగా తిరగడం లేదని గుర్తు చేశారు. భర్త, తండ్రి పేరు అడ్డుపెట్టుకుని దొంగ ఏడ్పులు ఏడుస్తూ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఘనత వైఎస్ కుటుంబానికే దక్కుతుందన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి సహకరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని తంగుడుబిల్లి గ్రంథాలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని శ్రీ రామ యువజన సంఘం నాయకులు కోరారు. మంగళవారం యువజన సంఘం ప్రతినిధి చందక మన్మధ రావు మాట్లాడుతూ తంగుడుబిల్లి గ్రామంలో పెద్ద మాస్టారు పి. నర్సింహం స్ఫూర్తితో శ్రీరామ యూత్ ఈ- గ్రంథాలయం సువిశాల ప్రాంగణంలో యువత, విద్యార్థులు కోసం నిర్మిస్తున్నామని తెలిపారు. నిర్మాణం ముగింపు దశకు చేరుకొని ప్రారంభానికి సిద్ధమైందన్నారు. అయితే ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉండటం వల్ల దాతలు విద్యావంతులు, ఉద్యోగులు, పెద్దలు, యువకులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కాగా ఆర్థిక సహాయం చేయదలిచిన వారు 8985493914, 6305042755 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అధికారులకు 'పట్ట'ని వ్యధ

- నాలుగేళ్లయినా అందని ఇళ్ల పట్టాలు
- పలు చోట్ల కదలని నిర్మాణాలు
- ఈ నెలాఖరికి ప్రారంభం సాధ్యమైనా?

ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకునే జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒక్కో లబ్ధిదారుడు ఒక్కో విధమైన సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పట్టాలిచ్చినా స్థలం బాగోకపోవడంతో నిర్మాణాలు చేపట్టలేక ఇబ్బందులు పడుతుంటే మరిన్ని కొన్ని చోట్ల పట్టాలిచ్చి స్థలాలూ బాగున్నా సౌకర్యాలు కల్పించడంలో యంత్రాంగం విఫలమవడంతో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కాగా మరి కొన్ని చోట్ల లబ్ధిదారులను గుర్తించినా ఇప్పటికీ వారికి పట్టాలు ఇవ్వకపోవడంతో నాలుగేళ్లగా పట్టాలు కోసం ఎదురుచూస్తున్నారు. ఇన్ని సమస్యలతో జగనన్న కాలనీ లబ్ధిదారులు అవస్థలు పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

బక్కునాయుడుపేట వద్ద నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని అరిగి పాలెంలో ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు అధికారులు 30 మంది అర్హులను గుర్తించారు. వీరందరికీ గ్రామ కంఠం భూమిని ఇచ్చేందుకు అధికారులు సర్వే కూడా చేశారు. అయితే గ్రామ కంఠం అనుభవంలో ఉన్న రైతులు మాత్రం ఆ భూమి తమ తాత తండ్రుల నుంచి తమ అనుభవంలోనే ఉందని అది ఇళ్ల స్థలాలకు ఇవ్వడం కుదరదని తేల్చి చేప్పేశారు. దీంతో అక్కడ ఇప్పటి వరకూ స్థలాలు ఇవ్వలేదు.

సోంపురం గ్రామంలో జగనన్న కాలనీ కోసం 40 మందిని గుర్తించారు. వీరికి కేటాయించిన స్థలం ఊరికి దూరంగా రాతి క్వారీ దగ్గర ఉండటంతో అక్కడ క్వారీల పేలుళ్ల వల్ల ప్రమాదాలు జరుగుతాయని లబ్ధిదారులు వెళ్లడానికి ఇష్టపడడం లేదు. దీంతో అక్కడ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి.

పికెఆర్‌పురంలో లోతట్టు ప్రాంతంలో లబ్ధిదారులకు స్థలాలు ఇవ్వడం వల్ల వర్షం పడితే ఇళ్ల స్థలాలు మొత్తం నీటమునిగిపోతున్నాయి. దీంతో అక్కడ నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ముకుందపురంలో కూడా ఊరుకు దూరంగా ముళ్ల పొదలు, గుట్టల్లో, రాళ్ల బండల మధ్య ఇంటి స్థలాలు ఇవ్వడం వల్ల లబ్ధిదారులు అక్కడకు వెళ్లడానికి ఇష్ట పడలేదు.

అధికారులు తొందరపాటు నిర్ణయాలతోనే అవస్థలు

ప్రభుత్వం చెప్పిన వెంటనే అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేయకుండా హడావుడిగా తొందరపాటు నిర్ణయాలతో ఇష్టానుసారంగా స్థలాలను గుర్తించడం వల్ల లబ్ధిదారులు ఇప్పుడు ఇంటి నిర్మాణాలు చేసుకోలేకపోతున్నారు. కనీసం ఇంటి నిర్మాణం చేసుకునేందుకు వీలు లేని ప్రాంతాలను గుర్తించి పేదలకు ఇవ్వడంతో చాలా మంది లబ్ధిదారులు నిర్మాణాలకు వెనుకడుగు వేస్తున్నారు. గ్రామాలకు, పట్టణ ప్రాంతాలకు ఆనుకుని వందల ఎకరాల్లో ప్రభుత్వ భూములున్నా పేదలకు మాత్రం కొండల్లో, గుట్టల్లో, చెరువు గర్భంలో అసలు నిర్మాణానికి పనికి రాని చోట స్థలాలు ఇవ్వడంతో ఎవరూ నిర్మాణాలకు ముందుకు రాలేదన్న వాదన వినిపిస్తుంది.

నెలాఖరుకు ఎలా సాధ్యం?

మండలంలో చాలా గ్రామాల్లో జగనన్న కాలనీల్లో నిర్మాణాలు పూర్తి కాలేదు. కొన్ని చోట్ల నిర్మాణాలు ప్రారంభించన పరిస్థితి ఉంది. ఇటువంటి సమయంలో ఈ నెలాఖరుకు జగనన్న కాలనీల్లో ఇళ్లను ప్రారంభించాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆదేశించడం హాస్యాస్పదంగా ఉంది. మండలంలోని బొద్దాం గ్రామం తప్ప మిగతా గ్రామాల్లో పూర్తిస్థాయిలో గృహ నిర్మాణాలు జరగలేదు. నిర్మాణాలకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో కూడా కూలీల రేట్లు, మేస్త్రి రేట్లు, మెటీరియల్ రేట్లు విపరీతంగా పెరిగిపోవడంతో చాలా మంది నిర్మాణాలకు ముందుకు రాలేదు. దీంతో జగనన్న కాలనీల్లో నిర్మాణాలు ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న నగదును పెంచాలని, పట్టాలివ్వని లబ్ధిదారులకు పట్టాలివ్వాలని, అనువైన స్థలాలను కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

వైద్య సిబ్బందికి ఘన సత్కారం

ప్రజాశక్తి- దెంకాడ

మండలంలోని చింతలవలస సచివాలయం-2లో మోపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బందిని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూప్ రాణి సాలువతో పాటు సన్మానించి గిఫ్ట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వైద్య సిబ్బంది తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సుమారు 45 రోజులపాటు ప్రజలకు సేవలు అందించారని వారిని సన్మానించడం మంచి పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, ఐసిడిఎస్ సిబ్బంది పలువురు నాయకులు పాల్గొన్నారు.

వేపాడ: స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపిపి సత్యవంతుడు

వేపాడ: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు పాల్గొని వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, సర్పంచ్ రుద్ర అంజలి, ఎంపిటిసి లక్ష్మి, పార్టీ అధ్యక్షుడు జగ్గ బాబు, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ సన్యాసినాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, జెసిఎస్ కన్వీనర్లు, తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపిడిఒ పట్నాయక్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ కామేశ్వరి, పిహెచ్‌సి వైద్యాధికారులు, పాల్గొన్నారు.

బొండపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలందరికి రక్షణ కవచంలా ఉంటుందని ఎంపిపి చల్ల చలం నాయుడు అన్నారు. గురువారం మండలంలోని కొండకిండాం గ్రామంలో తహశీల్దారు డిఎంజిఎన్ ప్రసాదరావు ఆధ్వర్యంలో సర్పంచ్ పెదమజ్జి ఆదిలక్ష్మి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరి ఆరోగ్యం కోసం ప్రభుత్వం మంచి ఆలోచన చేసి గ్రామాలకు వైద్య బృందాలను పంపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షలు బొద్దల చిన్నం నాయుడు, బుంగ దేవుడు, పంచాయతీ కార్యదర్శులు

దెంకాడ: వైద్య సిబ్బందిని సత్కరిస్తున్న ఎంపిపి వాసుదేవరావు

కొండ్రోతు నిహారిక, తుంపల్లి అచ్యుత రావు, విఆర్‌ఒ హరి, చొక్కాకు నారాయణరావు, పెదమజ్జి గోపి, పెదమజ్జి నాయుడు బాబు, బోపారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బొబ్బిలి: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా బుధవారం 19వ వార్డులో ఇంటింటికి వెళ్లి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మధుమేహం, బిపి వైద్య పరీక్షలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని లెక్కిడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీ ఉపాధ్యాయులను బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ పనిచేసిన వరి రామవతారం, బొడ్డేపల్లి దుర్గయ్య, కె విజయలక్ష్మి, విద్యార్థుల ప్రగతిక ఎంతో కృషి చేశారని అన్నారు. ఉపాధ్యాయుల దుర్గయ్య ఎంతోమంది పేద విద్యార్థులకు ఆర్థికంగా వస్తు, పుస్తక రూపంలో సహాయం అందించారని గుర్తు చేశారు. ఏటా ఆగస్టు 15న 10వ తరగతి విద్యార్థులలో పాఠశాలకు ప్రథమ స్థానం సంపాదించిన విద్యార్థులకు సైకిలను పంపిణీ చేసే వారిని అన్నారు. ఉపాధ్యాయులు రామవతారం విద్యార్థులతో సైన్స్ ప్రదర్శనలో పాల్గొనడంలో తర్ఫీదులను ఇచ్చేవారన్నారు. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యను పెంచడంలో ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో లచ్చిరెడ్డి కృష్ణ, ఉపాధ్యాయులు చిన్నమనాయుడు, బంకురు వెంకటరమణ, హరికృష్ణరావు, ఏంవై రామారావు, దేవుడు, రాము, కళ్యాణ్ కుమార్, రాణి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వివక్ష లేకుండా పథకాలు : ఎమ్‌పి

ప్రజాశక్తి - రామభద్రపురం

మాట్లాడుతున్న ఎంపి బెల్లాన చంద్రశేఖర్

ఎపికి మళ్లీ జగన్మోహన్‌రెడ్డిని సిఎంను చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో మండల పార్టీ అధ్యక్షులు అప్పికొండ లక్షుంనాయుడు, ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో వివక్షతకు తావులేకుండా ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత టిడిపి పాలనలో జన్మభూమి కమిటీలు, ఆ పార్టీ నాయకులు అనర్హులకు సంక్షేమ పథకాలు అందించి కమిషన్లు మూట గట్టుకొని స్వయం లబ్ధి పొందే వారని విమర్శించారు. సుదీర్ఘ పాదయాత్రలో జగనన్న అన్ని వర్గాల ఇబ్బందులు గుర్తించి అధికారంలోకి వచ్చిన తరువాత వివక్ష లేకుండా లంచం, కమిషన్ అనే ప్రసక్తే లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి వేస్తున్నారన్నారు. పార్టీ అధిష్టాన వర్గాల అభిప్రాయం మేరకు 'ఎపికి జగన్' ఎందుకు కావాలంటే? కార్యక్రమంలో భాగంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు, ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులైన వారికి అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించాలని సూచించారు. ఓటర్లందరికీ ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించి ఫ్యాన్ గుర్తుకు మరలా ఓట్లు వేసి జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, వైస్ ఎంపిపి బెల్లాన ప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు, పిఎసిఎస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కరపత్రాలను అందిస్తున్న కర్రోతు బంగార్రాజు, సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు తదితరులు

గ్రామాల్లో 'బాబుతో నేను'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని వల్లూరు, మల్యాడ గ్రామాల్లో టిడిపి బాబుతో నేను కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఇచ్చాపురం నియోజకవర్గం పరిశీలకులు, జిల్లా సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్ ఆధ్వర్యంలో నియోజక వర్గం ఇంచార్జి కర్రోతు బంగార్రాజు పాల్గొని కర పత్రాల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ చంద్ర బాబుపై వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేదిస్తుందని ప్రజలంతా గమనించి వచ్చే ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెబుతారన్నారు. చంద్రబాబు విడుదలయ్యేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, తెలుగు యువత అధ్యక్షులు నల్లం శ్రీను, యువ నాయకులు అట్టాడ శ్రీధర్, పంచాది జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మారని తీరు

- సభ్యులు కాని వారిదే పెత్తనం
- మిన్నకున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ వై పద్మజ ఆధ్వర్యంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హాజరయ్యారు. సమావేశం ప్రారంభం నుంచే వాడి వేడిగా చర్చ జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు రెవెన్యూ పరంగా సమస్యలు తీవ్రతరంగా ఉన్నాయని, వీటి పరిష్కారానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని డిప్యూటీ తహశీల్దారు రమేష్‌కు సూచించారు. శాశ్వత భూహక్కు సర్వే చేయించాలని సర్పంచులు, ఎంపిటిసిలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రెవెన్యూ పరంగా ప్రత్యేక సమావేశం పెట్టి పరిష్కరించుకుందామని తెలిపారు. మండలంలో భూమి రీ సర్వే అనంతరం, పాసు బుక్కుల కేటాయింపు సమయంలో గతంలో కొనుగోలు, అమ్మకాలు జరిపిన వారి పేర్లు కూడా చేర్చడం వల్ల రాబోయే రోజుల్లో సమస్య ఉత్పన్నం అయ్యే అవకాశం ఉందని దీని వల్ల గ్రామాలలో ఉన్న ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చిన్నరావుపల్లి సర్పంచ్ భూసాల దేవుడు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. నిమ్మలపాలెం సర్పంచ్ కొట్యాడ నిర్మల సాయి సభలోనే ఉన్నా ఆమె భర్త కొట్యాడ శ్రీను సభ్యుడు కాకపోయినా సమావేశంలో పాల్గొని అధికారులను పలు అంశాలపై ప్రశ్నించడం చర్చనీయాంశమైంది. మంగళ పాలెం సర్పంచ్ కుమారుడు పొలమరశెట్టి అనిల్ కూడా ఎటువంటి పదవి లేకపోయినా సభలో పాల్గొన్నారు. సభలో సభ్యులు కానీ వారు ప్రాతినిధ్యం వహించడంపై మిగిలిన నాయకులు పెదవి విరిస్తున్నారు. సభ్యులు కాని వారిని ఎంపిడిఒ కనీసం బయటకు పంపించే ప్రయత్నం కూడా చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సమగ్ర భూహక్కు సర్వే వల్ల జరిగిన అవకతవకలకు గ్రామాలలో గ్రామ సభ రెవెన్యూ అధికారులు నిర్వహించాలని, ఈ సమస్యకు పరిష్కారం చూపాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వైస్ ఎంపిపి మేలాస్త్రి సరస్వతి, కర్రి శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి కర్రి ధర్మారావు, ఇతర శాఖల అధికారులు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అధికారి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన

ప్రజాశక్తి - గజపతినగరం

అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ గజపతినగరం ఎంఎస్‌వి రవి ప్రసాద్ అన్నారు. బుధవారం అగ్నిమాపక కార్యాలయ ఆవరణలో శ్రీసాయి ఫార్మసీ కాలేజ్ విద్యార్థులకు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఏ విధంగా స్పందించాలో, వాటిని ఏ విధంగా ఎదుర్కోవాలో వివరిస్తూ వారితో కూడా ఆర్పే ప్రయత్నం చేయించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపు వద్ద యువకుల కొట్లాట

- ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని తీరప్రాంతమైన పెద్ద కొండ్రాజుపాలెం గ్రామానికి పండుగకు వచ్చి మద్యం షాపువద్ద మంగళవారం రాత్రి జరిగిన కొట్లాటలో ఇద్దరు యువకులు కొన ఊపిరితో ఉండగా మరో యువకుడికి గాయాలయ్యాయి. దీనిపై స్థానికులు అందించిన వివరాలు మేరకు.. పెద్ద కొండ్రాజుపాలెం పంచాయితీ గ్రామ దేవత పండుగలు జరుగుతున్నాయి. పెద్దకొండ్రాజుపాలెం గ్రామానికి చెందిన కేశం అమ్మోరు విశాఖపట్నంలో ఉంటు పండుగకు వచ్చాడు. మద్యం కొనుగోలు చేసేందుకు సమీపంలోని తోటపల్లి మద్యం షాపుకు వెళ్లాడు. ఇంతలో విశాఖపట్నానికి చెందిన మూతుడు, ముక్కాం గ్రామానికి చెందిన నవీన్ అలియాస్ స్రాపడు, మైలపల్లి రాజు మరి కొంత మంది వచ్చారు. మద్యం కొనుగోలుకు వెళ్లినప్పుడు భుజం రాసుకొని వెళ్లడంతో ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. ఇందులో మూతుడు జేబులో ఉన్న కత్తి తీసి ఆమ్మోరు కడుపు లోన శరీరం పైన ఇస్టాను సారంగా పొడిచాడు. అమ్మోరుతో వచ్చిన మారుపల్లి చినరాముడు అడ్డుపడగా మూతుడు ఆ వ్యక్తి తలపై బీరు సీసాతో బలంగా కొట్టాడు. దీంతో చినరాముడు అక్కడకక్కడే కుప్ప కూలిపోయాడు. వెంటనే వారు పారిపోవడంతో అక్కడే ఉన్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం వారిని విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కె.జి.హెచ్‌కు తరలించారు. ఇందులో అమ్మోరు, చినరాముడు చావు బతుకుల మధ్య ఉన్నట్లు చెబుతున్నారు. దీనిపై భోగాపురం సిఐ బి.వి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్.ఐ కృష్ణమూర్తి నిందుతులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

తలకు గాయమైన చినరాముడు

చికిత్స పొందుతున్న అమ్మోరు

దార్శనికుడు పొట్టి శ్రీరాములు

విజయనగరం టౌన్: ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన గొప్ప దార్శనికుడు, సంఘ సంస్కర్త అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బుధవారం అమరజీవి పొట్టి శ్రీరాములు స్టిక్కర్లు విడుదల చేశారు. పొట్టి శ్రీరాములు స్మృతి పరిరక్షణ సమితి, అమరజీవి జిల్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు లక్షల స్టిక్కర్లు విడుదల చేసారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్, కార్యదర్శి సముద్రాల నాగరాజు, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బి.పి.ఎస్.రామయ్య, ఎవి కృష్ణారావు, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన నల్ల ఇసుక మాయం

ప్రజాశక్తి - భోగాపురం

ఇక్కడ ఇసుకనే మాయం చేశారు..

మండలంలోని ముక్కాం తీరంలో రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన నల్ల ఇసుకను అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా తరలించుకు పోయారు. దీని విలువ సుమారు 2లక్షలు రూపాయలు ఉంటుంది. తరలించుకుపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పది రోజులు కిందట సముద్రపు ఒడ్డునున్న నల్ల ఇసుకను కొంతమంది అక్రమంగా తరలించి తోటల్లో నిల్వ చేశారు. ఈ సమాచారం అందుకున్న తహశీల్దారు చింతాడ బంగార్రాజు విఆర్‌ఒ శ్రీలక్ష్మిని పంపించి ఇసుకను సీజ్ చేయించారు. సీజ్ చేసిన ఇసుకను ఇటీవలి కొంత మంది వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా తరలించి అమ్మేశారు. రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసినప్పటికి ఇంతలా భరితెగించారంటే ఇక్కడ నల్ల ఇసుక ద్వారా ఎంతలా సంపాదిస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది. దీనిపై విఆర్‌ఒ శ్రీలక్ష్మిని వివరణ కోరగా సీజ్ చేసిన ఇసుకను తరలించుకుపోయారని ఒప్పుకోవడం కొసమెరుపు.